# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 307: ఆధ్యాత్మిక జ్ఞానమునకు నిదర్శనములు
# ఫిబ్రవరి 17, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 13-18 నుండి తీసికొనబడినవి

స్వామి, దశరథ మహారాజు గురించి, పుత్రకామేష్టి యజ్ఞం గురించి విన్నాము. జనక మహారాజు గురుంచి చెప్పండి.

భగవాన్: జనకుడు రాజయోగి, గొప్ప జ్ఞాని, దేహాభిమానం లేనటువంటి వాడు. దేహాభిమానం లేని వాడు కనుక విదేహ అని పిలువబడేవాడు. విదేహుని కుమార్తె కనుక సీతా దేవిని వైదేహి అని పిలుస్తారు. జనకుడు ఆదర్శవంతుడైన రాజు, గురు భక్తి కలిగిన వాడు, శాస్త్ర జ్ఞానము కలిగిన వాడు, వైరాగి. అతని ధర్మమునకు ప్రకారంగా సీతా దేవి వివాహం జరిపించాడు. ఆ తరువాత సీతా రామ లక్ష్మణులు వనవాసము చేయుటకు బయలుదేరారు. వారి వనవాసం ఎన్నో సంవత్సరములు సాగినా జనకుడు ఒక్క సారి కూడా ఆ వనంలోనికి అడుగు పెట్టలేదు. అట్టి జ్ఞానము, వైరాగ్యము కలిగిన వాడు జనకుడు.

స్వామి, ఆది శంకరులు చిన్న వయసులోనే మరణించాడని వింటుంటాం. దానికి కారణం ఏమై ఉంటుంది?

భగవాన్: నిజమే, అద్వైతమును ప్రతిపాదించిన ఆది శంకరుడు చిన్న వయసులోనే మరణించాడు. ప్రస్థానత్రయ శాస్త్రములైనటువంటి ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీతల పై భాష్యములు రచించాడు. జ్ఞాన మార్గమునకు ప్రాధాన్యత ఇచ్చినా అనేక భక్తి స్తోత్రములు కూడా రచించాడు. భక్తిని పెంపొందించడానికి, ఆధ్యాత్మిక జ్ఞానమును వ్యాప్తి పరచడానికి దేశమంతా తిరిగి పీఠములను స్థాపించాడు. భారత దేశము యొక్క సనాతన ధర్మమునకు సరియైన నిదర్శనము అతడు.

ఆది శంకరులు కాశీ యాత్రకు వెళ్ళి అక్కడ అధిష్టాన దేవుడైన విశ్వనాథుణ్ణి తాను చేసిన మూడు తప్పులకు క్షమాపణ కోరాడు. తన వచనం వేరు, ఆచరణ వేరు అనేది మొదటి పొరపాటు. వాసుదేవః సర్వమ్ ఇతి, అంటే దేవుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, అని చాటి చెపుతూ మరి కాశీలో దేవుని దర్శనం చేసుకొనుటకు వచ్చాడు. యతో వాచో నివర్తంతే, అంటే దేవుడు ఆగ్రాహ్యము, అనిర్వచనీయము అయినప్పటికీ దైవత్వము గురించి గ్రంథములు రచించుట అతని రెండవ పొరపాటు. మూడవ పొరపాటు వచ్చి ఏకోహం బహుస్యాం, రూపములు ఎన్నైనను దైవం ఒక్కటే; ఆత్మవత్ సర్వ భూతాని, అందరిలోనూ ఉన్న దైవం ఒక్కడే; ప్రజ్ఞానం బ్రహ్మ, అందరిలోని చైతన్యం ఒక్కటే అని అనేక విధములుగా చాటి చెప్పుచూ ఎన్నో మఠాలు స్థాపించి తన శిష్యులను భిన్నముగా భావించాడు.

అతని జీవితంలో ఇంకొక సంఘటన గురించి కూడా వినే ఉంటారు. సన్యాసం పుచ్చుకోవడానికి తల్లి అనుమతి కోరాడు కానీ ఆమె వెంటనే ఒప్పుకోలేదు. ఒక రోజు శంకరుడు స్నానం చేయుటకు నదికి వెళ్తే అక్కడ ఒక మొసలి అతని కాలు పట్టుకుంది. తల్లిని గట్టిగా పిలిచాడు, “అమ్మా, అమ్మా, నేను సన్యాసిని అవడానికి నువ్వు అనుమతి ఇస్తే గానీ ఈ మొసలి నన్ను విడువదు. నీటిలోకి లాగేస్తుంది.” ఆ తల్లి అప్పుడు అనుమతి ఇస్తే ఆ మొసలి శంకరుని వదిలేసింది.

దీని అంతరార్ధమేమిటి? ఆ నది సంసారంతో సమానమైతే, మొసలి విషయ వాసనలతో సమానం. విషయ వాసనలనే మొసలి మానవుణ్ణి సంసారమనే నదిలోనికి లాగేస్తుంది. వైరాగ్యమే విముక్తి.

ఈ జీవితములో చేయవలసిన కార్యములన్నియు పూర్తి చేసిన వెంటనే శంకరుడు దేహమును త్యజించాడు. తర్వాత అతని శిష్యులు ఆయన సిద్ధాంతానికి మార్గదర్శకులుగా ఉండి, అద్వైతమును అన్ని మూలలకు వ్యాపింపచేశారు. ఆ శిష్యులు కూడా  శంకరుని లక్ష్యం నెరవేర్చగల శక్తిసామర్ధ్యములు కలిగిన వారు.

స్వామి, ప్రసిద్ధ రామ భక్తుడైన త్యాగరాజు ఎన్నో కీర్తనలను రచించారు. అవి ఈనాటికీ అందరూ పాడుతూనే ఉన్నారు. ఆ కృతులలో విశేషం ఏమిటి?

భగవాన్: దైవ భక్తి గీతాలు రచించిన వారు ప్రపంచములో ఎందరో ఉన్నారు. దేవుడు వారిని అనుగ్రహించాడు కూడా. అవి మనను మైమరపించి, పరవసింప చేస్తాయి. కానీ త్యాగరాజ కృతులలో ఒక ప్రత్యేకత ఉంది. అతడు రచించిన ప్రతి కీర్తన అతని జీవితములో జరిగిన సంఘటనల గురించి రాసినవి.

ఉదాహరణకు, తంజావూరు రాజు త్యాగరాజుకి నగలు, నాణ్యములు, ఎన్నో బహుమానములను పంపితే అతను మర్యాదగా తిరస్కరించాడు. అప్పుడు ఒక కృతి రాశాడు, “నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా?” అని.

ఇంకొక సారి త్యాగరాజుని సోదరుడు అతను పూజించే విగ్రహాలన్నీ తీసుకెళ్ళి కావేరి నదిలో పారవేశాడు. త్యాగరాజు ఎంతో బాధపడి ఏడ్చాడు. ఒక రోజు కావేరి నదిలో స్నానం చేస్తుండగా రాముని అనుగ్రహంతో ఆ విగ్రహాలన్నీ దొరికినప్పుడు, తన చేతులలో జాగ్రత్తగా ఇంటికి తెచ్చుకుంటూ, “రారా మా ఇంటి దాకా, రఘువీర సుకుమార,” అని కీర్తనను పాడుకున్నాడు.

ఈ విధంగా త్యాగరాజు రచించిన ప్రతి కీర్తన అతని నిజ జీవితములో జరిగిన సంఘటనకు సంబంధించినది. అందువలననే అవి అతని భక్తి శరణాగతులను నిరూపిస్తుంటాయి.

దేవుడు గుణాతీతుడు. సాత్విక, రాజసిక, తామసిక గుణములకు అతీతుడైన వాడు. కానీ మానవుడు ఈ గుణములచే బంధింపబడి ఉన్నాడు. అయితే మానవుడు భగవంతుడిని ఎలా అనుభవించగలడు?

భగవాన్: దైవత్వానికి రెండు ఆకారాలు ఉంటాయి. గుణములు కలిగిన వాడు, గుణాతీతుడు కూడా. ఇక్కడ ముఖ్యముగా గమనించవలసినది ఏమిటంటే గుణాలలో దేవుడు ఉన్నాడు కానీ, దేవునిలో గుణములు ఉండవు. గుణములేవీ దైవత్వము లేకుండా వ్యవహరించ లేవు. నగలలో బంగారం ఉంటుంది కానీ బంగారంలో నగలుండవు కదా. మట్టితో కుండలు తయారు చేయొచ్చు కానీ కుండలతో మట్టి తయారవదు. వెండితో పాత్రలు తయారు చేయొచ్చు కానీ వెండిలో పాత్రలు ఉండవు.

అదే విధముగా భగవంతుడు గుణములలో ఉన్నాడు కానీ భగవంతునిలో గుణములు ఉండవు. అంటే భగవంతుడు సగుణ బ్రహ్మ మరియు నిర్గుణ బ్రహ్మ అని కూడా చెప్పవచ్చు.

ప్రతి మానవునికి సత్త్వ, రజ, తమో గుణములు ఉంటాయి. కానీ ఏ గుణమైతే ప్రబలంగా ఉన్నదో ఆ రకంగా ప్రవర్తిస్తాడు. మానవుడు ఈ మూడు గుణములకు అతీతుడు అవ్వనిదే నిజ రూప దైవమును అనుభవించుటకు సాధ్యము కాదు.

ధన్యవాదములు. వచ్చే వారం మళ్ళీ కొనసాగిద్దాం.